: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వుల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 సంచిక : 46 14-08-2023 పుటలు : 4 + 4



## ఒక్క సిరా చుక్క!

స్వాతంత్రోద్యమం గురించి ఏ చరిత్ర పుస్తకం తిరగేసినా ఆనాటి ఉద్యమకారులు,నాయకుల గురించి కనిపిస్తుంది. ఆ నేతల భావాలను,బోధనలను ఎప్పటికప్పుడు సామాన్య ప్రజానీకానికి చేరవేసి తెల్లదొరలని తరిమికొట్టేందుకు కావలసిన ధైర్యాన్ని వాళ్లకు అందించి అఖండ భారతావనిని సమైక్యం చేసిన పత్రికల ప్రస్తావన పెద్దగా మనకు కనిపించదు.కానీ స్వరాజ్య సాధనలో ఆ మహానాయకులు ఎంత ముఖ్యమో,నాటి పత్రికలు కూడా అంతే కీలకం. కేసరి,మరాఠా, హితవాది, ఆనందబజార్, ఆర్య మిత్ర, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, యుగాంతర్, వందేమాతరం, యంగ్ ఇండియా, నవజీవన్.... ఇలా ఎన్నో పత్రికలు జనంలో మహోద్యమానికి ఊపిరులూదాయి.దేశభక్తిని త్యాగనిరతిని ప్రభోదించాయి. ప్రజల ఐక్యత కోసం కులభేదాలను రూపుమాపటంకోసం స్వేచ్ఛ, సమానత్వాన్ని తెలియచేస్తూ అవిశ్రాంతంగా కృషిచేశాయి. భరతమాత దాస్య శృంఖలాలను తెంచేందుకు నిరవధికంగా పోరాడాయి.స్వేచ్ఛాభారతిని మనకు ప్రసాదించాయి.ఆనాటి పత్రికలను ఒకసారి స్మరిస్తూ.....

**అందరికీ భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు!!**

– నన్నయవాణి



## మంచిమాట

విద్య నేర్చుకునేటప్పుడు గతంలో తానేమీ నేర్చుకోలేదని భావించి కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలి. గుణపాఠాల విషయంలో మాత్రం పాత అనుభవాన్ని నిత్యం పునఃశ్చరణ చేసుకుంటూ ఉండాలి. ఒకప్పుడు స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన భారతదేశ జనులు గుర్తుంచుకోవాల్సిన పరమ సత్యమిది.

- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్



# ఘనంగా ప్రారంభమైన ఎ.పి.ఎ.ఎస్.ఎల్.పి.ఎ కాన్ఫెరెన్స్

### హాజరైన ఎంపీ భరత్, వీసీ పద్మరాజు



జ్యోతిప్రజ్వలన చేసి కాన్ఫెరెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ఆడియోలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేతాలజీస్ట్ అసోసియేషన్ (ఎ.పి.ఎ.ఎస్.ఎల్.పి.ఎ) కాన్ఫెరెన్స్ 2023 ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెషన్ సెంటర్ లో నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫెరెన్స్ ఎంపీ భరత్ రామ్, వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రిసెంట్ రిహెబ్యులెటేషన్ రిసెర్చ్ అనే థీమ్ తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.పీ మార్గాని భరత్ రామ్, వీసీ ఆచార్య కె.పద్మరాజు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం 2016 లో ప్రారంభమైందని, దానిని పూర్తి స్థాయిలో అమలు చేసే విధంగా పార్లమెంటులో చర్చిస్తానని అన్నారు. యువతరం ఆడియోలజీస్ట్ లు వైద్య వృత్తితో పాటు సమాజ అవగాహన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా నూతన విషయాలు తెలుస్తాయని, రెండు రోజుల కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీసీ పద్మరాజు మాట్లాడుతూ నేటి కాలంలో ఎక్కువ మంది చిన్నారులు, యువతరం సెల్ ఫోన్లకు బానిసలయ్యారని, కంటికి దగ్గరగా ఎక్కువ కాంతి, ఎక్కువ శబ్దం, వేగాల కారణంగా ఎక్కువ సేపు చూడటం ద్వారా మెదడులోని నరాలు తీవ్ర ఒత్తిడికి గురై అనేక రుగ్మతలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. దాంతో పాటు మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని, మానసిక సమస్యలకు గురవుతున్నారని, బాల్యంలోనే చంచల మానసిక స్థితితో జీవిస్తున్నారని తెలియజేసారు. కాబట్టి సెల్ ఫోను కు దూరంగా పిల్లలను పెంచే విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఆడియోలజీస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేతాలజీస్ట్ అసోసియేషన్ (ఎ.పి.ఎ.ఎస్.ఎల్.పి.ఎ) ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయంలో ఉచిత క్యాంప్ ను నిర్వహించాలని, తద్వారా గోదావరి జిల్లాలో సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇండియన్ స్పీచ్ అండ్ హియరింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.ఎస్.పి.గోస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 300 మంది ఆడియోలజీస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేతాలజీస్ట్ లు ఉన్నారని, వారి సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడియోలజీస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పేతాలజీస్ట్ లు గా విద్యనభ్యసించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక కళాశాలను ఏర్పాటు చేయాలని తెలియజేసారు. వినికిడి శక్తిని నిర్లక్ష్యం చేయకూడదని, కంటి చూపు మాదిరిగా వినికిడి శక్తి లోపం వెంటనే తెలియదని చెప్పారు. ముందుగా గుర్తిస్తేనే చికిత్స చేసిన, హియరింగ్ ఎడ్ మిషన్ లు ఉపయోగపడతాయని తెలిపారు. ఏడాది దాటిన చిన్నారులు మాట్లాడుతున్నారా, లేదా అనే విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ చూపించి ముందుగానే సమస్యను గుర్తించాలని చెప్పారు. ఆరంభ దశలో ఏమైన సమస్యలను గుర్తిస్తే సమస్యలు పెద్దవి కాకుండా త్వరగా పరిష్కారాలు దొరుకుతాయన్నారు. ఆడియోలజీస్ట్ ల సేవలతో వికలాంగుల సంఖ్యను తగ్గించవచ్చునని, మెరుగైన, ఆరోగ్యవంతమైన సమాజాభివృద్ధి అందరూ కృషి చేద్దామని చెప్పారు. లైఫ్ టైమ్ ఎచీవ్ మెంట్ అవార్డ్ సత్యకిషోర్ కి అందజేసారు. నిర్వహకులు అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కాన్ఫరెన్స్ లో భాగంగా హియరింగ్ కంపెనీలకు సంబంధించిన 14 స్టాల్ ను ఏర్పాటు చేసారు. తరువాత రిసోర్స్ పర్సన్స్ డా. ప్రకాష్ బూమినాథన్, డాక్టర్ బి. శివ ప్రసాద్, ఎం.ఎ. శ్రీకాంత్, డా. యుగంధర్ రామకృష్ణ, సాయి కోటి, డా. అరివుడై నంబి, ఫణీధర్ రెడ్డి, డా. విజయ కుమార్ నార్నే, గిష్ చాకో, జి. శ్రీలక్ష్మి, మురళి, సోనాల్ చిట్నీస్ హాజరై ఉపన్యసించారు.

# ఉపకులపతి ఉవాచ



స్వేచ్ఛకోసం ఉద్యమాల జెండా పట్టిన జాతిమనది. స్వరాజ్య నిధి కోసం ఒంటిమీది ఆభరణాలను ఒలిచి ఇచ్చిన జనంమనం. హక్కులకోసం గొంతెత్తిన మనం స్వాతంత్ర్య పోరాటచరిత్రను ఒకసారి నెమరు వేసుకుంటే చాలా ఆశ్చర్యం అనిపిస్తుంది. పాఠ్యపుస్తకాల్లో పోరాటాల చరిత్రను చదువుతుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. సామాన్యుల త్యాగాలు,గాథల్ని తలుచుకుంటే గుండె ఉప్పొంగుతుంది.

గాంధీజీ నాయకత్వం జాతీయ ఉద్యమ పోరాటాన్ని,వ్యూహాన్ని మార్చివేసింది. ప్రజలకు ప్రశ్నించటం అలవాటుచేశారు. నిలదీయడం నేర్పారు. ప్రశ్న ఉద్యమానికి,ప్రగతికి ఆయువుపట్టు.

తరగతి గదిలో విద్యార్థులు ప్రశ్నించాలి. ప్రశ్నిస్తేనే జవాబులు దొరుకుతాయి.మౌనంగా కూర్చుని పాఠంవినటం మాత్రమే విద్యాధ్యయనం కాదు.విద్యార్థి ప్రశ్నించేలా,ఆలోచన రేకెత్తించేలా పాఠాల్ని చెప్పడమే నిజమైన బోధన కూడా.ప్రజా ప్రయోజనాన్ని కలిగించే పరిశీలనలే నిజమైన పరిశోధనలు కూడా!!

మనం వేరు, మనదేశం వేరుకాదు. మనం బాగుండటమే,మన సమాజం అభివృద్ధి చెందటమే దేశం బాగుండటమంటే.బహుశా ఆ సమైక్య,ఆదర్శ నినాదమే మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడానికి కారణమైంది.

ఎవరి ముందైనా రెండు మార్గాలు కనిపిస్తూ ఉంటాయి. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకొని చరిత్రను సృష్టించటం. చరిత్రను పూర్తిగా విస్మరించి చరిత్రలో కలిసిపోవటం.ఈ రెండు మార్గాల్లో మనం చేసుకునే ఎంపికే రేపటి చరిత్ర పుస్తకాల్లో మన స్థానాన్ని, మన జీవితాన్ని నిర్ణయిస్తుంది. శాశ్వతమైన ప్రయోజనాల దారుల్లో విద్యార్థులు ప్రయాణించాలని, తమదైన చరిత్రకి ఒకపేజీని ఏర్పాటు చేసుకోవాలని, విజయాల వైపుకి ప్రయాణించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం రోజున నేను విద్యార్థులను కోరుకుంటున్నాను. ఆ దిశగా విద్యార్థులను ప్రయాణింప చేయాలని అధ్యాపక వర్గానికి విన్నవిస్తున్నాను.

**అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు!!**

ఆచార్య కె.పద్మరాజు

# ఎంబీఏ, ఎంకాం ఫేర్‌వెల్





ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ నందు ఎంబీఏ మరియు ఎం.కామ్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు వారి సీనియర్స్ నకు "బోన్ వయోగ్ భాష్" అనే పేరుతో ఘనంగా ఫేర్వెల్ పార్టీని ఇచ్చారు. ఈ కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమల కుమారి, డిసిఎంఎస్ హెచ్ ఓ డి డా.అజయ్ రతన్ అధ్యాపకులు డా.రామరాజు, డా.అనిలాంబిక, డా.మధు కుమార్, మణికంఠేశ్వర్ రెడ్డి, మనోజ్ దేవ, డా.అప్పారావు , డా.శ్రీదేవి, డా.ఉమా రజిత తదితర బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని ఆటపాటలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో క్యాంపస్ లో సందడి వాతావరణం నెలకొల్పారు.

# సంపాదకీయం




## దేశభక్తి

'పేట్రియాటిజం' అనే మాటకు పర్యాయపదంగా 'దేశభక్తి' పదాన్ని వాడుతున్నాం. కేంబ్రిడ్జి నిఘంటువు ఈ పదానికి " *When you love your country and proud of it*'' అనే వివరణనిచ్చింది. దేశాన్ని ప్రేమించటం,దేశాన్ని చూసి గర్వించటం ఇవి దేశాభిమానానికి చెందిన అంశాలే. దేశభక్తి అనే పదబంధం చాలా క్లిష్టమైంది. దాని అర్థం అంత సరళమైందేమీ కాదు.

*గలివర్ ట్రావెల్స్ రాసిన జోనాథన్ స్విఫ్ట్ 'డబ్లీ డయింగ్ 'అనే మాట వాడారు. దేశభక్తి లేనివాడు రెండుసార్లు మరణించినట్లని. సహజంగా అందరూ ఒకసారి మరణిస్తారు,దేశభక్తి లేనివాడు రెండుసార్లు మరణిస్తాడని ఆయన ఉద్దేశం. దేశభక్తి లేనివాడు జీవించి ఉన్నా మరణించినట్లేనని ఆయన అభిప్రాయం.అంతేకదా!*

*సర్ వాల్టర్ స్కాట్ పండితుడు 'పేట్రియాటిజం' పోయెమ్ లో "ఆత్మ చచ్చిపోయినా ఊపిరి పీల్చే వాడెవడు. వాడికి ఊపిరి ఉన్నా లేనట్లే లెక్క.వాడు ఈ దేశంలో పుట్టి పెరిగి ఇక్కడ ఉంటున్నా... వాడు విదేశీయునిక్రిందే లెక్క.ఏ నీచమైన దుమ్ములో నుంచి అతడు ఎలా పుట్టుకుని వచ్చాడో, చివరికి అదే నీచమైన దుమ్ములోకి వెళ్ళిపోతాడు. అతనిని తలచేవారు కానీ, అతనిని కీర్తించే వారు కానీ, అతని కోసం కన్నీరు విడిచేవారు కానీ ఎవరు లేరు. ఉండరు..." ఇలా సాగుతుంది ఆ గేయం. ఇది దాని సారాంశం.*

*మాఖన్ లాల్ "పూల్ కి చాహ్" హిందీ రచనలో.... " నిజమైన దాస్యశృంఖలాలను పోగొట్టి బానిసత్వం నుంచి స్వేచ్ఛ కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన దేశభక్తుల సమాధి మట్టి మీద మాత్రమే నేను రాలిపోవాలని అనుకుంటున్నాను.." అంటుంది పుష్పం.'ఉదాత్త సమాధి మృత్తికన్' అన్నారు వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు దీపావళి కావ్యంలో.*

*కావున దేశభక్తి అనేది సమాజానికి ఒక తప్పనిసరి సాంస్కృతికమైన అంశం మాత్రమే కాదు, భౌతికమైన అవసరం కూడా. భూభాగాల్ని ఆక్రమిస్తూ ఓటమి-గెలుపుగా సాగినంత కాలం దేశభక్తికన్నా రాజభక్తే రాజ్యమేలింది. ప్రాణాలొడ్డి యుద్ధం చెయ్యటమే రాజభక్తికి గల వ్యక్తీకరణ. కానీ దేశభక్తి జాతి ప్రయోజనానికి చెందింది. మన దేశ జాతీయోద్యమమే మనల్ని ఒక జాతిగా రూపొందింపజేసిందనేది మనం ఒప్పుకోవాల్సిన నిజం. దానికి తోడు ప్రజాస్వామ్య రాష్ట్రోద్యమాలు,భాషోద్యమాలు, సంస్కృతికోద్యమాలు ఒకదానికి మరొకటి తోడై సమానత్వం, సౌభ్రాత్రం, లౌకికం, విశ్వ మానవత్వం, సామాజిక న్యాయం వంటి గొప్ప విలువలన్నీ మన ముందుకొచ్చాయి.*

***1857** ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుంచి జాతీయోద్యమం వరకు మన జాతి చరిత్రలో ఒక మహత్తరమైన యుగం మనల్ని మనంగా తీర్చిదిద్దింది. మంగల్ పాండే బలిదానం నుంచి లక్ష్మీ బాయి, భగత్ సింగ్, సీతారామరాజు, నేతాజీ ....వీరందరి త్యాగాలను స్మరించుకునే ప్రతి అక్షరం మనకు ముఖ్యమైందే.*

*"మహాత్ములు వచ్చారు, వెళ్ళారు.ధూళి రేగింది. అంతేకానీ ఎత్తుపల్లాలు ఏకం కాలేదు" అన్నారు బాబాసాహెబ్ అంబేద్కర్. దేశభక్తి ప్రపూరితమైన సమానత్వ భావనలు మాత్రమే మన సమాజంలోని అసమానతలను దూరం చేస్తాయి.*

*"దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా! వట్టిమాటలు కట్టిపెట్టోయ్, గట్టిమేల్ తలపెట్టవోయ్!!" నూటపదేళ్ల క్రితం గురజాడ రాసిన సరిహద్దులెరుగని ఈ అనంత భావాల సంగీతాన్ని నిత్యం స్మరించాల్సిందే.గత వైభవ స్మరణం కూడా దేశభక్తిని తట్టిలేపుతుంది.*

*సాంస్కృతిక పరాధీనతలోనికి వెళ్లిపోతున్న సుప్తమైన జాతిని జాగృతం చేయటానికి మహనీయులు,రచయితలు,కవులు,ఉద్యమకారులు...అనేక కోణాల్లో మనల్ని తట్టిలేపుతూనే ఉన్నారు.మనిషి తన అస్తిత్వాన్ని,కర్తవ్యాన్ని వెతుక్కునే ప్రతి ప్రయత్నం కూడా ముందుకు వెళ్లే మార్గమే!! దేశ ఔన్నత్యం కోసం సమాజసేవలో నిరంతరం కర్తవ్యోన్ముఖులై ముందుకు సాగుదాం!జయోస్తు!!*

# ఈశా గ్రామోత్సవం విజయవంతం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఈశా గ్రామోత్సవం, గ్రామీణ భారత క్రీడా స్ఫూర్తి, సంస్కృతి ఉత్సవం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల గ్రామోత్సవం కార్యక్రమానికి ఎం.పీ మార్గాని భరత్, వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి వాలీబాల్ సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. 2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం, గ్రామీణ భారతదేశ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడానికి ఉద్దేశించబడ్డాయన్నారు. దీనితోబాటు సామాజిక స్పృహ,





సంప్రదాయాలు ఇంకా ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంచడమే లక్ష్యంగా ఈ క్రీడా కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించారని చెప్పారు. విశ్వవిద్యాలయంలో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈశా గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మారుమూల ప్రాంతాల నుండి క్రీడాకారులు విశ్వవిద్యాలయానికి వచ్చి పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు. నేటి ఒత్తిడి ప్రపంచంలో యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, సమస్యలను అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ దినోత్సవం మరియు ఎస్.ఆర్.రంగనాథన్ 131వ జయంతి ఘనంగా జరిగినది, ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఎస్.ఆర్.రంగనాథన్ గ్రంథాలయ విద్యలో నూతన ఒరవడులు తీసుకువచ్చి పాఠకులకు మరింత దగ్గరగా పుస్తకాలు మరియు సమాచార విజ్ఞనము అందుబాటులో ఉండటానికి అవసరమైన సిద్ధంతాలు రుపకల్పనచేసారని గ్రంథాలయంలో పాఠకులే రాజులని వారికీ కావలసిన సమాచారం అందిచటం మరియు అందుబాటులో ఉంచడం గ్రంథాలయాల యొక్క ప్రాధమికవిధి అని తెలిపారు. ఆయని కృషిని గుర్తించిన భారతప్రభుత్వము పద్మశ్రీ తో సత్కరించిదని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సమన్వయకర్త డా.పి.విజయ నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయసేవలను ఉపయోగించుకోవాలని, గొప్పవ్యక్తులు అందరు గ్రంథాయాన్నివిరివిగా ఉపయోగిచుకున్నవారేనని తెలిపారు. మరియు ఎస్.ఆర్.రంగనాథన్ ఆశయాలకు అనుగుణంగా గ్రంథాలయ సిబ్బంది సేవలను అందించాలని, మారుతున్న పాఠకుల అభిరుచికి అనుగుణంగా సేవలు మెరుగుపరచాలని తెలియజేసారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లైబ్రరీ డా.టి.సింహాచలం మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయవిద్యలో ఎస్.ఆర్. రంగనాథన్ కృషి కోనియాడదగినదని, తన ప్రాముఖ్యమైన రచనయైన గ్రంథాలయశాస్త్రము యొక్క ఐదు సూత్రీకరణలు (five laws of library science) ద్వారా లైబ్రరీ విద్యలో కొత్త పుంతలు తొక్కించారని పుస్తకాలు రాయటమే కాకుండా వాటిని ఆచరణలో చూపించారని, పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచాలని,



వారి అభిరుచులను గౌరవిస్తూ గ్రంథాలను సమీకరించాలని, ప్రతీఒక్కరి అవసరాలకు విడిగా అందుబాటులో ఉంచాలని, లైబ్రరీల్లో పాఠకులు తమకు అవసరమైన పుస్తకాలు చిటికెలో వెతికిపట్టుకోగల వీలుండాలని, కాలానుగుణ అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయం ఎప్పటికప్పుడు క్రొత్త హంగులు సంతరించుకోవాలని తెలిపారు. ఫ్యాకల్టీ అసోసియేట్ డా.సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయశాస్త్రనిర్వహణలో కొత్త మెలుకువలు నేర్పి, గ్రంథాలయవిద్యలో విప్లవాత్మక మైన మార్పులు తీసుకువచ్చి సమాచార విజ్ఞానం అందుబాటులో ఉంచటానికి అనువైన కృషి డా.ఎస్.ఆర్.రంగనాథన్ చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ డా. పి.వేంకటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.జ్యోతిర్మయి, డీన్ ఎగ్జామినేషన్స్ డా.మట్టారెడ్డి, ఆచార్య వై. శ్రీనివాసరావు, డా.కె. దీప్తి మరియు గ్రంథాలయ సిబ్బంది విజయ కుమార్, సతీష్, దుర్గా ప్రసాద్,మణికంఠ,సూర్య కుమారి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం పారిశ్రామిక సందర్శనలో భాగంగా నెల్లూరులోని ఎస్.డి.ఎస్.సి.షార్ శ్రీహరికోటకు వెళ్ళారు.**



# ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్‌లో నన్నయ రెండవ స్థానం

**7.08.23 (మీడియాసెల్)**

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్ కిక్ బాక్సింగ్ పోటీలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి రెండవ స్థానం దక్కిందని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. సోమవారం యూనివర్సిటిలో కిక్ బాక్సింగ్ లో విజేతగా నిలిచిన కె.జ్యోతికుమారిని వీసీ సన్మానించి జ్ఞాపిక, సర్టిఫికెట్టులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ (ఉమెన్) వీర్ బహుదూర్ సింగ్ పూర్వాంచల్ విశ్వవిద్యాలయం ఉత్తర్ ప్రదేశ్ లో మార్చి 20 నుండి 22 తేదీలలో జరిగిన పోటీలలో సర్ సి.ఆర్.రెడ్డి కళాశాల ఏలూరు విద్యార్థిని కె.జ్యోతికుమారి ద్వితీయ బహుమతిగా సిల్వర్ మెడల్ ను కైవసం చేసుకుందని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి రూ. 20 వేలు క్యాష్ అవార్డు, సర్టిఫికెట్స్ ను అందజేసామన్నారు. జ్యోతికుమారి క్రీడలతో పాటు ఎన్.సి.సి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందని తెలియజేసారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఉన్న అవకాశాలను ఉపయోగించుకుంటూ ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. జ్యోతికుమారి పట్టుదలతో భవిష్యత్ లో మరిన్ని విజయాలను సాధించి అందరికీ మంచి పేరును తీసుకురావాలని


జ్యోతికుమారిని అభినందిస్తున్న వీసీ కె.పద్మరాజు

ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ క్రీడాకారిణి జ్యోతికుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జ్యోతికుమారి తల్లి కె.నాగమణి, కోచ్ వి.అంజిబాబు, బాక్సింగ్ అఫీషియల్ సిహెచ్.చంద్రశేఖర్, ఎం.భవానీశంకర్, పి.నాగరాజు, ఎ.ధర్మేంద్ర స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ డా.కె.సుబ్బారావు, సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, డా.బాల సత్యనారాయణ, డా.వి.వి.ఎం.యు.ఫణీంద్ర, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి, హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్ట్ 15




**నన్నయ యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ పైన ఎగురుతున్న త్రివర్ణ పతాకం**

**ఫోటో: సాయికుమార్,అనలిటికల్ కెమిస్ట్రీ**

భారత స్వాతంత్ర చట్టం 1947 జూలై 18 వ తేదీన ఆమోదం పొందినా ఆగస్టు 15న స్వాతంత్ర్యం ప్రకటించాలని అప్పటి భారత వైస్రాయి మౌంట్ బాటన్ నిర్ణయించాడు. రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ మిత్ర దేశాల కూటమికి జపాన్ లొంగిపోయిన రోజది.అందుకే ఆ తేదీని ఎంచుకున్నాడు బాటన్.

ఆగస్టు 15న భారతతో పాటు మరో ఐదు దేశాలు స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటాయి.అవి బెహ్రెయిన్, ఉత్తరకొరియా, దక్షిణ కొరియా, లిక్టిన్ స్టైల్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో.

# ఎం.పి.ఈడీ కోర్సును సద్వినియోగం చేసుకోండి

భారతదేశంలోనే అతితక్కువ ఫీజులతో, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అందిస్తున్న ఎం.పి.ఈడీ కోర్సును అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీలో ఎం.పి.ఈడీ కోర్సు బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మాత్రమే మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎం.పి.ఈడీ) కోర్సు అందుబాటులో ఉందని, గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని క్రీడా స్ఫూర్తి ఉన్న విద్యార్థులకు అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ కోర్సులో ఏపీ పీజీ సెట్ అర్హత సాధించిన అభ్యర్థులు చేరవచ్చునని అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అనుభవం గల అధ్యాపక బృందంతో ఎం.పిఈడీ కోర్సు ఆరు వసంతాలను విజయవంతంగా పూర్తి చేసుకుందని తెలిపారు. నన్నయ యూనివర్సిటీలో ఎం.పి.ఈడీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలలో ఫిజికల్ డైరెక్టర్స్ గా స్థిరపడ్డారని మరియు ప్రతీ ఏడాది యూజీసీ నెట్, ఏపీ సెట్ పరీక్షలలో విద్యార్థులు అర్హత సాధిస్తున్నారని చెప్పారు. ఎం.పి.ఈడీ కోర్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే 400 మీటర్స్ రన్నింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోట్స్, వాలీబాల్, త్రోబాల్, హేండ్ బాల్, కబడ్డి, ఖోఖో, బాల్ బ్యాట్మెంటన్ వంటి క్రీడావసతులు ఉన్నాయని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిధులతో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ వంటివి ఆధునిక క్రీడావసతులు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, కోర్సు కోఆర్డినేటర్ డా.బాలసత్యనారాయణ, డా.వి.వి.ఎం.యు.ఫణీంద్ర, డా.బి.రామ్ గోపాల్, డా.ఎం.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, సాల్మన్ దేవానంద్, సుబ్రహ్మణ్యం,బాషా తదితరులు పాల్గొన్నారు.



**ఎం.పి.ఈడీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య కె.పద్మరాజు**

# సమష్టి కృషితో నన్నయను అభివృద్ధి చేద్దాం

**11.08.23 (మీడియాసెల్)**

మహనీయుల కృషి ఫలితంగా ఏర్పడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉమ్మడి గోదావరి జిల్లాల విద్యాకేంద్రంగా ఉందని, సమష్టి కృషితో పని చేసి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేద్దామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడారు. దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు, గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి సభ్యుల కృషి ఫలితంగా ఏర్పడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అందుకుంటూ నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల విద్యార్థులు నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పీజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ వంటి కోర్సులలో అపార అనుభవం, డాక్టరేట్స్ కలిగిన అధ్యాపక బృదంతో నాణ్యమైన విద్యను అందిస్తూ ఉమ్మడి గోదావరి జిల్లాలకు తలమానికంగా నిలుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన అధ్యాపక పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేయనుందని, తద్వారా ఆయా విభాగాల్లోన్ని ఖాళీలు భర్తీ అవుతాయని చెప్పారు. తనకంటే ముందు పని చేసిన నాలుగురు వీసీ లు విశ్వవిద్యాలయానికి స్థల సేకరణ, భవన నిర్మాణాలు, అనుబంధ కళాశాలలు తీసుకురావడం, నాక్ గుర్తింపులను సాధించడం వంటి విశ్వవిద్యాలయ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేసారు. విశ్వవిద్యాలయానికి ప్రస్తుతం నాక్ బి ప్లస్ గ్రేడ్ వచ్చిందని, ఎ లేదా ఎ ప్లస్ గ్రేడ్ సాధించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. నాక్ లో మంచి గ్రేడ్ రావడం ద్వారా రూసా నిధులతో పాటు నేషనల్ రిసెర్చ్ ఫండ్స్ కూడా వస్తాయని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి పరిశోధనలకు ఆ నిధులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. యూనివర్సిటీలో కాలేజ్ డెవలప్మెంట్ సెల్, పరీక్ష విభాగాలలో ఆటోమేషన్ విధాలను తీసుకువస్తామని అన్నారు. తద్వారా పరిపాలన వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 అమలు చేస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉందని దానిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. నూతన విద్యావిధానం, రాష్ట్ర ప్రభుత్వం విద్యపై పెట్టిన ప్రత్యేక దృష్టితో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో భాగంగా రూ.16.50 కోట్లతో గర్ల్స్ హాస్టల్ భవన నిర్మాణం, రూ.9.10 కోట్లతో బాయ్స్ హాస్టల్ భవన నిర్మాణాలను చేపట్టామన్నారు. కాకినాడ,తాడేపల్లిగూడెం క్యాంపస్ లలోని సీసీ రోడ్లు నిర్మాణాలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా నిధులతో యూనివర్సిటీ ప్రాంగణంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను జరుగుతున్నాయని చెప్పారు. అలాగే ఈ నెల 16,17 తేదీలలో రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది, నన్నయ మహాభారత సహస్రాబ్ది కార్యక్రమాలను విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమి, నన్నయ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సాహిత్య ప్రముఖులంతా హాజరవుతున్నారని అన్నారు. వెయ్యేళ్ళ చరిత్ర, సంస్కృతి, సాహిత్యానికి సంబంధించి గొప్ప వేడుక సహస్రాబ్ది ఉత్సవాలని తెలియజేసారు. రాజరాజనరేంద్రుడు పరిపాలించిన రాజమహేంద్రవరంలో, ఆదికవి నన్నయ పేరుతో ఏర్పడిన విశ్వవిద్యాలయంలో ఉత్సవాలు జరగడం విశ్వవిద్యాలయానికి చారిత్రక ఘట్టమన్నారు. సాహిత్య ప్రముఖులు, విద్యవేత్తలు సహస్రాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, జె.ఎన్.టి.యు.కె., డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీ, ఎన్.ఐ.టి ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా గోదావరి క్లస్టర్ యూనివర్సిటీగా ఏర్పడి ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య వై.శ్రీనివాస రావు, ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.కె.రమణేశ్వరి, డా.పి.విజయనిర్మల, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.కె.నూకరత్నం, ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కె.పద్మరాజు**




## కానవరంలో ఉచిత యోగా కార్యశాల


**13.08.23 (మీడియాసెల్)**

యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ కానవరం వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత యోగా వర్క్‌షాప్ ను నిర్వహించారు. యోగాచార్య డా. రాపర్తి రామారావు గురూజీ యొక్క మానవత్వం, భౌతిక మరియు ఆధ్యాత్మిక అభ్యున్నతి అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేనేజింగ్ ట్రస్టీ యోగా చైతన్య ట్రస్ట్ టి.ఎల్. నరసింహం, వీసీ ఆచార్య కె.పద్మరాజు, సీనియర్ సాధక రాపర్తి రామారావు గురూజీ శిష్యులు డా.ఎ.ఇందుమణి, వై.సి.టి.గోదావరి శాఖ సలహాదారు డా.ఎం.వి.జి.ఎస్.శర్మ హాజరై ఉపన్యాసించారు. అనంతరం సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.

# నన్నయలో ఉచిత హోమియోపతి వైద్యకేంద్రం

**ప్రారంభించిన వీసీ ఆచార్య కె.పద్మరాజు**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డాక్టర్ వినయ్ సుంకర హెల్త్ సెంటర్ లో ఉచిత హోమియోపతి వైద్య కేంద్రాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ పిఠాపురం వారి సౌజన్యంతో ఫ్రీ హోమియోపతిక్ మెడికల్ సర్వీస్ ను ప్రారంభించామని అన్నారు. యూనివర్సిటీ హెల్త్ సెంటర్ లోని ప్రతి బుధవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిష్ణాతులైన వైద్య బృందం అందుబాటులో ఉంటారని చెప్పారు. విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి వైద్య, మందులు ఉచితంగా ఇస్తారని



అన్నారు. హోమియోపతి వైద్యంలో అపార అనుభవం కలిగిన ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ ఆనందకుమార్ పింగళి, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. ఆనందరావు లు హోమియోపతి వైద్యకేంద్రాన్ని నిర్వహిస్తారని చెప్పారు. విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఉచితంగా హోమియోపతి వైద్యసేవలందించేందుకు ముందుకు వచ్చిన ఉమర్ అలీషా మరియు ట్రస్ట్ సభ్యులకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్యులను, అధికారులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డా.పి.విజయనిర్మల మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రాజరాజనరేంద్ర పట్టాభిషేక
# సహస్రాబ్ది మహోత్సవాలు
## (1022 - 2022)

**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం**
**16,17 ఆగస్ట్ 2023**
**వేదిక:ఎన్.టి.ఆర్. కన్వెన్షన్ సెంటర్**

**1.రాజరాజనరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది**
**2. తెలుగులో భారతావిర్భావానికి వెయ్యేళ్లు**
**3. రాజమహేంద్రవరం నగరానికి వెయ్యేళ్లు**

**దేశంలో వెయ్యేళ్ల చరిత్ర ఉన్న నగరాలు - (బెనారస్ , మధురై , తంజావూరు వంటివాటి సరసన చేరేనగరం రాజమహేంద్రవరం)**

చరిత్ర ఒక నిరంతర మేధాప్రక్రియ. అది అన్ని తరాలకు తెలియాలి. చరిత్రను సరైన పునాదులమీద నిర్మించినప్పుడే జాతి ప్రతిష్ట , ఆత్మగౌరవం నిలబడుతుంది. భారతదేశ గతవైభవం మరే దేశంతోనూ తీసిపోనిది. తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో రాజమహేంద్రవరం తరతరాలుగా సాంస్కృతిక రాజధానిగా పేరెన్నికగన్నది. దీనికి కారణం తూర్పుచాళుక్యులే. రాజకీయ, భాష, సాంస్కృతిక పరంగా తెలుగు నేలను పరిపాలించిన రాజ వంశాల్లో తూర్పు చాళుక్య వంశం అగ్రగణ్యమైనది.

**తూర్పుచాళుక్యుల వైభవం :**

చరిత్రలో చాళుక్య శబ్దం 7వ శతాబ్దం నుండి కనిపిస్తుంది. తూర్పు చాళుక్యులు ఆంధ్రదేశాన్ని సుమారుగా ఐదు వందల సంవత్సరాలు పాలించారని చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. చాళుక్య భీముడు, గుణగ విజయాదిత్యుడు, రాజరాజ నరేంద్రుడు ఈ ముగ్గురు ప్రసిద్ధమైన వ్యక్తులని ఆంధ్రదేశ చరిత్ర తెలియజేస్తోంది.

**తూర్పుచాళుక్యులు - సాంస్కృతిక వికాసం:**

చాళుక్యుల కాలంలోనే చాళుక్య శిల్పరీతులతో పంచారామ దేవాలయాల నిర్మాణం జరిగింది. దీనిని కొనసాగిస్తూ బిక్కవోలు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, వేంగిక్షేత్రంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం, పశ్చిమ గోదావరి జిల్లాలోని పండిత గ్రామమైన కాకరపర్రులోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం మొదలైన వాటిని రాజరాజ నరేంద్రుడు నిర్మించాడు. అదేగ్రామంలో ఏనుగుల రావి అనే స్థలంలో ఉన్న రావిచెట్టు కూడా రాజరాజ నరేంద్రుని నాటివే. నన్నయ భట్టారాకుడు తన భారతంలో అర్జునిని తీర్థయాత్రల సందర్భంలో దక్షారామం వచ్చినట్టుగా రాశాడు. నన్నయ సహాధ్యాయి అయిన నారాయణ భట్టు కుమార్తె కుపమ వేయించిన దానశాసనం ద్రాక్షారామంలో కనిపిస్తుంది.

**రాజరాజ నరేంద్రుడు:**

రాజరాజ నరేంద్రుడు 1002 లో జన్మించాడు. విమలాదిత్యుడు, కుందవి (రాజరాజచోళుని కుమార్తె) తల్లిదండ్రులు. రాజరాజ నరేంద్రుని తాత దక్షిణాపథంలో గొప్ప చక్రవర్తిగా పేరుగాంచిన రాజరాజచోళుడు. విమలాదిత్యుని తర్వాత రాజరాజనరేంద్రునికి క్రీ.శ.1022 ఆగస్టు 16 న పట్టాభిషేకం జరిగింది. తంజావూరు మహారాజు రాజేంద్రచోళుని (మేనమామ) కుమార్తె అమ్మంగదేవితో వివాహం జరగడంతో చోళ,చాళుక్యుల మధ్య బంధం మరింత బలపడింది.ఇతని కుమారుడు రాజేంద్రుడు (కులోత్తుంగ చోళుడు). రాజరాజనరేంద్రునికి ముందు తూర్పుచాళుక్యులు వేంగి (ఏలూరు సమీపంలో ఉన్న- పెదవేగి)ని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. రాజరాజనరేంద్రుడు దాయాదులతో మరియు శత్రురాజులతో జరుగుతున్న పోరును తప్పించుకోవటానికి రాజమహేంద్రపురం నగరాన్ని నిర్మించి తనరాజధానిని 1022లో అక్కడకు మార్చాడు. నిరవద్యనరేశ్వర,కుమారవిద్యాధరవంటి ఆయనకున్న బిరుదులు ఆయనకు గల శత్రుభయంకర సామర్థ్యాన్ని,ఆయనలోని పాండిత్యాన్ని మనకు పట్టిస్తాయి.

**నన్నయ భట్టారకుడు :**

రాజరాజనరేంద్రుని ఆస్థాన పండితుడు నన్నయభట్టు. నన్నయ పూర్వీకులు తెలుగు సంస్కృతభాషలో శాసనాలు రాసినట్టుగా ఆధారాలు లభిస్తున్నాయి. దీనినిబట్టి పండితవంశంలో పుట్టిన నన్నయ తన సంకల్పంతో తెలుగు భాషా సాహిత్యాలకు దిశానిర్దేశం చేశాడని చెప్పవచ్చు.


**నన్నయ వంశక్రమం:**

మాధవ భట్టు (వడకలూరు శాసనకర్త ) - పోతన భట్టు (యలవర్రు శాసనకర్త ) - భీమన భట్టు (రణస్థిపూడి శాసనకర్త)- బేతన భట్టు (కోరుమిల్లి శాసనకర్త ) - నన్నయభట్టు (నందంపూడి శాసనకర్త )

1053 నందంపూడి దానశాసన కర్త నన్నయ. నారాయణ భట్టుకు దానమిచ్చిన శాసనం.

**తెలుగులో భారతావిర్భావానికి కారణాలు :**

రాజరాజనరేంద్రుని ఆస్థానకవి, పురోహితులు,




మహారాజునకు అత్యంత ఆత్మీయుడు నన్నయ భట్టారకుడు. రాజరాజ నరేంద్రునికి ఇష్టమైన పనుల్లో భారతాన్ని వినడం ఒకటి. మహారాజు తమ పూర్వులు, చంద్రవంశపు రాజులైన కౌరవ, పాండవుల చరిత్ర అయిన మహాభారతం జయసంహిత పేరుతో సంస్కృత భాషలో ఉందని, తమిళ కన్నడ భాషల్లో అది తర్జుమా అయిందని తెలుగులో కూడా మహాభారతం ఉండాలని...దానిని తెలుగులో రచించాలని నన్నయ మహాకవికి రాజరాజ నరేంద్రుడు ప్రేరణ ఇచ్చాడు. దాని ఫలితమే ఆంధ్ర మహాభారత రచన. అది తెలుగులో ఆదికావ్యంగా నిలిచింది. నన్నయ ఆదికవి అయ్యాడు.

**కావ్యభాషను రూపొందించిన వాగనుశాసనుడు నన్నయ :**

కవిత్వ రచనకు,భాషకు ఒక రూపం ఏర్పడటానికి, ప్రయోగార్హమైన భాషగా తెలుగు శాశ్వతత్వాన్ని పొందటానికి కారణమయ్యాడు నన్నయ. రాజరాజ నరేంద్రుని కోరికమేరకు , నన్నయ మహాభారత రచనకు శ్రీకారం చుట్టి వెయ్యేళ్లు పూర్తయింది. ప్రపంచ భాషాసాహిత్య చరిత్రలో వేయి సంవత్సరాల సుదీర్ఘ సాహిత్యచరిత్ర కలిగిన భాష తెలుగు.నన్నయ చేతితో శ్రీకారం చుట్టబడి రాజమహేంద్రవరంలో పురుడుపోసుకున్న తెలుగు సాహిత్యం నన్నయ నుంచి నేటివరకూచాలా విశేషమైన సాహిత్యంతో వైభవాన్ని పొందటం తెలుగుభాష గొప్పతనం. తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టడమే కాకుండా భావికవులకు మార్గదర్శనం చేసిన మహాద్రష్ట నన్నయ. సంస్కృత సాహిత్యానికి వాల్మీకి ఆదికవి అయినట్లు తెలుగు సాహిత్యానికి నన్నయ ఆదికవి అయ్యాడు.అందుకే తెలుగులో తొలి జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందిన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు నన్నయ గారిని "ఋషి వంటి నన్నయ రెండవ వాల్మీకి " అని వాల్మీకితో సమానమైన స్థానాన్ని ఇవ్వడం నన్నయగారి గొప్పదనాన్ని తెలియజేస్తుంది.

**రాజమహేంద్రవరం నగరానికి వెయ్యేళ్లు :**

రాజమహేంద్రపురం నగరాన్ని రాజరాజు తన పేరుతో నిర్మించి, తన రాజధానిగా చేసుకుని పరిపాలించాడు.ఈ నాటికీ నగరం తన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. దేశంలోఉన్న అతి పురాతన నగరాలైన బెనారస్ , మధురై , తంజావూరు వంటివాటి సరసన చోటుదక్కించుకోవడానికి అన్ని అర్హతలు ఉన్న నగరంగా దీన్ని చెప్పవచ్చు.

**సహస్రాబ్ది:** 2022 ఆగస్టు 16 నాటికి రాజరాజనరేంద్ర పట్టాభిషేక మహోత్సవానికి వెయ్యేళ్ళు (సహస్రాబ్ది). తెలుగు భారతం ఆవిర్భవించి వెయ్యేళ్లు(సహస్రాబ్ది). రాజరాజ నరేంద్రుడు నిర్మించిన రాజమహేంద్రవరం నగరవయస్సు వెయ్యేళ్లు (సహస్రాబ్ది). ఈ మూడు విశిష్ట సందర్భాలను కలుపుకొని ఈ మహోత్సవాన్ని2022 నుండి 2023 వరకు తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకోవాల్సిన సమయమిది. రాజమహేంద్రవర పట్టణంలోని రాజరాజనరేంద్రనగర్ లో ఆయన ఆస్థాన పండితుడు ఆదికవి నన్నయ పేరుతో నెలకొన్న విశ్వవిద్యాలయంలో ఈ సహస్రాబ్ది మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి,గతవైభవాలను స్మరించి వర్తమాన సమాజానికి ప్రేరణఇవ్వటం విశ్వవిద్యాలయం తన బాధ్యతగా భావిస్తుంది.

నన్నయ విశ్వవిద్యాలయం 2023 ఆగస్టు16,17 తేదీల్లో రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలను జరుపబోతోంది.కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన్నివ్వటం ఎంతో సంతోషకరమైన విషయం.అకాడమీకి విశ్వవిద్యాలయం ధన్యవాదాలనందిస్తోంది.

**విశ్వవిద్యాలయ ప్రత్యేకతలు :**

రాజమహేంద్రవరంలో తెలుగు చరిత్రకు చిహ్నంగా నన్నయ విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. విశ్వవిద్యాలయ ప్రవేశద్వారం చాళుక్య ద్వారం. విశాలమైన విశ్వవిద్యాలయ ప్రాంగణం రాజరాజ నరేంద్రనగర్. విశ్వవిద్యాలయం పేరు "ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం". 11 వ శతాబ్దంలోని తూర్పు చాళుక్యుల పరిపాలన వైభవం, ఆంధ్రదేశ చరిత్ర ప్రతిబింబించేలా రాజమహేంద్రవరంలో విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పటం, ప్రభుత్వాలు సహకరించటం, ప్రజల అభీష్టం ఎంతో సంతోషదాయకం

**సహస్రాబ్ది మహోత్సవాల ఆశయం :**

తెలుగు మహాభారతం పుట్టడానికి ప్రధాన భూమికను ఏర్పరచిన రాజవంశం తూర్పు చాళుక్యులది. మహాభారత రచనకు ప్రేరణ ఇచ్చినది రాజరాజ నరేంద్రుడు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర వంశాల గత చరిత్ర ఎంత ఘనమైనదో, అది మిగిల్చిన వారసత్వసంపద ఏమిటో ఇప్పుడున్న తరాలకు తెలియాలి.దాని నుండి సమాజం చైతన్యవంతం కావాలన్నదే ఆశయం. ఈ సందర్భంగా సాహిత్యాభిమానులకు,తెలుగు సమాజానికి స్వాగతం పలుకుతున్నాం.

ఆచార్య కె.పద్మరాజు,ఉపకులపతి
ఆచార్య టి.అశోక్,కులసచివులు
డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, కన్వీనర్

రాజరాజనరేంద్రుని చిత్రం : శ్రీ గిరిధర్ గౌడ్
రూపకల్పన: ఆచార్య మొక్కా జగన్నాథరావు,పూర్వ ఉపకులపతి

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in

# కాకినాడ క్యాంపస్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు ఆగస్ట్ 9 న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కమలకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ మరియు ప్రస్తుత ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఓ.ఎస్.డి (ఐ.ఐ.ఎఫ్.టి కాకినాడ క్యాంపస్) డాక్టర్ టి.బాబురావు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం ఎన్నో ఆదివాసి జాతులు వారికి వివిధ మాండలీకాలు, వివిధ భాషలు కలిగి ఉన్న దేశం అని ఇలాంటి ఈ నవభారతంలో ఇంకా ఆదివాసీలు అభివృద్ధికి చాలా దూరంలో ఉన్నారు అని అన్నారు. ఆదివాసీలు మొత్తం జనాభా తీసుకుంటే అత్యధిక శాతం ఆర్థికంగా, సామాజికంగా అణగారింపబడుతున్న వర్గంగా పేర్కొనవచ్చు అని తెలిపారు. ఈ నవశకంలో "మణిపూర్ లో జరిగిన మారణకాండ వంటి పరిణామాలు భారతదేశ స్థితిగతుల్ని, అలాగే సాంఘిక అసమానతల్ని చూపెడుతున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ గిరిజన తెగల హక్కుల్ని కాలరాస్తూ చేసే వివిధ చట్టాలు ఇంకా వారిని కృంగదీసేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రైబల్ విషయాలపై వివిధ అంశాలకు సంబంధించి రాష్ట్రపతి మరియు ఇతర రాజకీయ నాయకులకు అధికారులకు రాసిన వివిధ లేఖలను, సిఫార్సులను విద్యార్థులకు విశ్లేషణాత్మకంగా వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ప్రజలను చైతన్యం చేయవలసిందిగా విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని కన్వీనర్ మరియు కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్ వివరిస్తూ సుమారు 14 మంది విద్యార్థినీ. విద్యార్థులు రాజనీతి మరియు ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో విద్యనభ్యసిస్తున్నారని అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు.గిరిజన విద్యార్థులు చేసిన గిరిజన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మిరాకిల్ ఇంజనీరింగ్ ఫౌండర్ డైరెక్టర్ డా. సిహెచ్. డేవిడ్ రాజు, ఆంగ్ల విభాగాధిపతి మరియు చీఫ్ వార్డెన్ ఎం.పోచయ్య, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు డా.ఎం.నానిబాబు, డా.కె.హరిబాబు, డా.పి.రాజ్ కుమార్ రెడ్డి మరియు డా.కే.స్వామీజీ, కోర్స్ కోఆర్డినేటర్లు డా.డి.అజయ్ రతన్, డా.కె.హారిక బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మణిపూర్ ఘర్షణలలో మృతి చెందిన ఆదివాసీలకు సంతాప సూచికంగా మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

# గూడెంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్ క్లబ్ సభ్యులు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ తల్లిపాల ఆగస్ట్ 1 నుండి 7వరకు2023 వారోత్సవాలను పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఫార్మసీ విభాగం వారి హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాలు మరియు సంబంధిత సమస్యలపై చర్యను తెలియజేయడం, యాంకర్ చేయడం, నిమగ్నం చేయడం మరియు ఉత్తేజపరిచే లక్ష్యంతో ప్రచారాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. తల్లి పాలివ్వడం అనేది శిశువు మరియు తల్లి ఆరోగ్యం యొక్క ప్రాథమిక అంశం, దీనికి సమాజంలోని అన్ని వర్గాల నుండి శ్రద్ధ మరియు మద్దతు అవసరం. తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి మహిళలకు హెల్త్‌కేర్ అండ్ మేనేజ్‌మెంట్ క్లబ్ సభ్యులు పండ్లు, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేస్తూ తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే పౌష్టికాహారం తీసుకోవడానికి ఉన్న ఉపయోగాలను వివరించారు. ఈ చొరవ ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడమే కాకుండా చనుబాలివ్వడం కాలంలో సమతుల్య ఆహారం యొక్క



ప్రాముఖ్యతపై కూడా వెలుగునిచ్చింది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా పని కట్టుబాట్లతో పాటు తల్లి పాలివ్వడాన్ని నిర్వహించడంలో మహిళలకు అవగాహన కల్పించడం మరియు మద్దతు ఇవ్వడం. ఈ కార్యక్రమంలో ప్రసూతి మహిళలు, హాస్పిటల్ సూపరింటెండెంట్ మరియు హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్ క్లబ్ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. పండ్లు మరియు డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేసినందుకు కృతజ్ఞత ప్రశంసలతో విద్యార్థులను కొనియాడారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ శ్రీ భాను శ్యామ్ మరియు రీష్మా మరియు కో- చైర్మన్ బాల మేఘిని ఇతర సభ్యులను ఇంచార్జ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శ్రీరమేష్ విద్యార్థులను అలానే డిపార్ట్‌మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ హీరా బట్టు, మరియు టీచింగ్ స్టాఫ్ శ్రీమతి ఎస్.లిఖిత మరియు పి. అరుణలను అభినందించారు.



# డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫేర్‌వెల్





ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో 'సయోనర 2కె23' పేరుతో ఫేర్వెల్ పార్టీని ఘనంగా నిర్వహించారు. , విభాగాధిపతి డా.ఎన్.ఉదయ్ భాస్కర్,డా.ఆర్.రాజేంద్రప్రసాద్,డా. పద్మవల్లి, డా.ఎం.రమేష్,డా.ఆలిస్ జాయ్, డా.రవిశంకర్,డా. ఎమ్.అమ్మిరెడ్డి, డా.జోహార్ కృష్ణ, డా.శ్రావ్య హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థానాలలో స్థిరపడేలా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం మూడు విభాగాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు చేసి వీడ్కోలు సమావేశాన్ని విజయవంతం చేశారు.





# 77వ స్వాతంత్ర్య దినోత్సవ రచనలు, విశేషాలు



## స్వాతంత్ర్య పోరాటంలో తూర్పుగోదావరి జిల్లా

దేశ స్వాతంత్రం కోసం జరిగిన అన్ని రకాల ఉద్యమాలు ఈ జిల్లాలో జరగడం విశేషం. 1837లో రంప లో జరిగిన సాయుధ తిరుగుబాటు, అల్లూరి విప్లవ పోరాటం, వందేమాతర ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అన్ని ఉద్యమాలు కూడా ఈ జిల్లాలో జరిగాయి. గోదావరి జిల్లాలోస్వతంత్ర పోరాటాలు 19వ శతాబ్దం ఆరంభంలో ప్రారంభమై 1837 ఏజెన్సీ ప్రజలు తమపై జరిగే దౌర్జన్యాలకు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగాతిరగబడ్డారు. 1845,48,51,58,70 లలో కూడా తిరుగుబాట్లు జరిగాయి.

వందేమాతర ఉద్యమం: 1907లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ పర్యటన వలన ఈ జిల్లాలో వందేమారం ఉద్యమ వ్యాప్తి చెందింది. కాకినాడలో ఇంగ్లీష్ క్లబ్ ధ్వంసం, రాజమండ్రిలో విద్యార్థుల ఉద్యమం మొదలగునవి. బిపిన్ చంద్రపాల్ పర్యటనతో విద్యార్థులు ప్రభావితమయ్యారు. కాకినాడ గంటస్తంభం వద్ద వందేమాతరం నినాదం ఇచ్చినందుకుగాను మెట్రిక్యులేషన్ చదివే కోపెల్ల కృష్ణారావును కెప్టెన్ క్యాంప్ స్పృహ తప్పేలా కొట్టాడు. దానితో ఆగ్రహావేశులైన ప్రజలు ఇంగ్లీష్ క్లబ్ పై దాడి చేశారు. ఈ కేసులో పన్నెండు మందిని అరెస్టు చేశారు. కలకత్తాలోని అమృత బజార్ పత్రిక కాకినాడను ప్రభుత్వం మరో రావల్పిండి పంజాబ్ గా తయారు చేస్తున్నదన్నమాట అని రాసింది.

సహాయ నిరాకరణ ఉద్యమం: ఇందులో భాగంగా ఒక సంవత్సరం లాయర్లు కోర్టులను బహిష్కరించారు. కాకినాడకు చెందిన బులుసు సాంబమూర్తి గారు పూర్తిగా ప్రాక్టీస్ వదిలేశారు. అంతర్వేదిలో గాంధీజీ ఫోటోలు రథంపై ఉంచి ఊరేగించారు. జిల్లాలో 24 మంది గ్రామాధికారులు



కాకినాడ కాంగ్రెసు డిశంబరు 1923 – ఆహ్వాన సంఘం (ఒక భాగం)
క్రింది వరుస: బులుసు సాంబమూర్తి (జనరల్ సెక్రటరీ) – ప్రక్కన లక్కరాజు సుబ్బారావు (కోశాధికారి)
కుర్చీల్లో: కొండా వెంకటప్పయ్యగారు (మధ్యన ఉత్తరీయంతో)

రాజీనామా చేశారు. విద్యార్థులు విద్యాలయాలను బహిష్కరించారు. 1921 డిసెంబర్ నుండి నిర్బంధాలు జరిగాయి. బులుసు సాంబమూర్తి, మొసలికంటి తిరుమలరావు, చెలికాని రామారావు, రంగయ్య నాయుడు, పప్పు అప్పయ్య దాసు మొదలగు ఎందరినో అరెస్టు చేశారు. 1921లో సీతానగరం నుండి బ్రహ్మదేవుల సుబ్రహ్మణ్యం గారు రైతు యాత్రను నడిపారు. సమిష్టి శాసన ఉల్లంఘన చేయటానికి ఆంధ్రదేశంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో రాజోలు ఒకటి.

**1923 కాకినాడలో జాతీయ కాంగ్రెస్ మహాసభలు:**

1923 కాకినాడ మహాసభ ఆహ్వాన సంఘానికి దేశభక్త కొండా వెంకటప్పయ్య అధ్యక్షులుగాను టంగుటూరి ప్రకాశం, కాశీనాథుని నాగేశ్వరావు పంతులు ఉపాధ్యక్షులుగాను, బులుసు సాంబమూర్తి ప్రధాన కార్యదర్శిగా మొత్తం 4,181 మంది సభ్యులతో పెద్ద ఆహ్వాన సంఘం ఏర్పడింది. కాకినాడ పడమర భాగంలో ఉన్న ఎలిబిన్ పేటకు చేరి ఉన్న విశాలమైన ప్రదేశానికి గాంధీనగరం అనే పేరు పెట్టి 120 ఎకరాల స్థలాన్ని సభా స్థలంగా ఎంపిక చేశారు. ఈ సభలలో మౌలానా మహమ్మద్ అలీ, చిత్తరంజన్ దాస్, మోతిలాల్ నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, డాక్టర్ అన్సారి, వల్లభాయ్ పటేల్, మంగల్ సింగ్, శ్రీమతి కస్తూరిబా గాంధీ, శ్రీమతి సరోజినీ నాయుడు వంటి పెద్ద నాయకులందరూ పాల్గొన్నారు. ఆ సమయంలో గాంధీజీ ఎరవాడ జైలులో ఉన్నందున రాలేకపోయారు.


ఉప్పు సత్యాగ్రహం: 1930లో చొల్లంగిలో జరిగిన సత్యాగ్రహానికి ఆనాడు జిల్లా నలుమూలల నుంచి దళాలుగా అనేకమంది స్వచ్ఛంద సేవకులు వచ్చారు. 1930 ఏప్రిల్ 6న గరిమెళ్ళ సత్యవీరభద్రరావు, రామచంద్రుని వెంకటప్ప, కొరళ్ళ రాజారావు ఉప్పు చట్టాన్ని ధిక్కరించడానికి నియమింపబడిన ప్రథమ సత్యాగ్రహదళం. వేల మంది ప్రజలు ఉద్యమంలో పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమం: 1942 ఆగస్టు 9న గాంధీజీని బొంబాయిలో అరెస్టు చేసిన వార్త దేశాన్ని కుదిపేసింది. జిల్లాలో పెద్ద ఎత్తున ఈ ఉద్యమం ప్రారంభమైంది. 1942 అక్టోబర్ రెండో తేదీన పెద్దాపురం ప్రజలు గాంధీ జయంతి నాడు జరిగిన ఊరేగింపులో లాఠీచార్జి జరిగింది. శ్రీ పి.ఎస్.శర్మ, సివికే.రావులను అరెస్టు చేసి ఆలీపూర్ జైలుకు పంపారు. నడింపల్లి రాంభద్రరాజు, కళావెంకటరావు, క్రొవ్విడి లింగరాజు, మల్లిపూడి పల్లం రాజులను డిటిన్యూగా నిర్బంధించారు.


పైన పేర్కొన్న విధంగా తూర్పుగోదావరి జిల్లా స్వాతంత్ర్య పోరాటంలో అన్ని రకాల ఉద్యమాలకు ప్రభావితమై ప్రముఖ పాత్ర పోషించింది. చివరిగా 1923 లో కాకినాడలో అఖిలభారత కాంగ్రెస్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించిన జిల్లా ప్రజలు 2023 డిసెంబర్ నాటికి వంద సంవత్సరాలు అవుతుంది. ఆనాటి స్ఫూర్తితో దేశం కోసం అందరం సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

**డాక్టర్ బి.వి.వి.బాలకృష్ణ**
రాజనీతి శాస్త్ర విభాగం

## విద్యార్థుల చిత్రలేఖన సృజన














## బలిదానం

భారత్‌కి పలకరించడానికి వచ్చిన బ్రిటిష్ వారు పరిపాలించడానికి సిద్ధమయ్యారు.



అచ్చమైన ప్రకృతిని బాంబులు దాడులతో
స్వచ్ఛమైన స్వేచ్ఛను కలుషితంతో
భరత జాతిని అతలాకుతుల పరిచారు
బ్రిటిష్ సైన్యం భారత్ లో భిక్షాటన
బిక్షించి భారత్ విలువైన సంపదను
బలవంతంగా దోపిడీకి దోచుకున్నారు

కుటుంబాన్ని బంధించి
దేశాన్ని నిందించి
పిల్లల్ని శిక్షించి
మహిళలను అవమానపరిచి
భారత్ ని రక్తపాతం చేసిన రాక్షసులు ఎందరో!
స్త్రీ స్వేచ్ఛనుచీకటి లోకంలోకి విడిచి
జ్ఞానాన్ని పొందకుండా దూరంగా ఉంచి
ఎవరు అనుభవించని శిక్షలు విధించి
స్త్రీ జీవితాన్ని అర్థరహిత పరిచారు.
కులమత బేధాలను అనుసరించి
ప్రజలను దారుణ శిక్షలకు గురిచేసి
దేశ సంపదను దోపిడీకి కేటాయించి
దేశ స్వేచ్ఛను అపహరించి
ఎన్నో హింస చర్యలకు పాల్పడిన బ్రిటిష్ సామ్రాజ్యం
ప్రతిక్షణం ప్రజల గుండెల్లో తడబాటులో...
ప్రాణాలు త్యాగపరచిన ఎందరో మహానుభావులు
కుటుంబాన్ని మరిచి
దేశాన్ని ప్రాణంగా భావించిన సమరయోధులు
అన్యాయం ఆచారంగా చేసిన సంప్రదాయాన్ని
న్యాయాన్ని సంప్రదాయంగా ఆచరించాలని
భారత జాతిని ఆ స్వేచ్ఛ నుండి విముక్తి చేయాలని
భారత రాజ్యాన్ని పీడిస్తున్న
బ్రిటిష్ అయిన నుండి కాపాడాలని ప్రాణాలను సైతం
లెక్కచేయకుండా పోరాటానికి మరో పేరుగా నిలిచిన ఎందరో సమరయోధులు
స్వార్థం తమ సొంతంగా భావిస్తున్న సమాజంలో కొందరు
నిస్వార్థంగా దేశ రక్షణ కొరకు చివరి శ్వాస వరకు స్వతంత్ర కోసం యుద్ధంలో పోరాడిన ఎందరో మహానుభావులు.

జైహింద్ జైహింద్ అంటూ
ప్రాణాలు త్యాగపరచిన భారత త్యాగమూర్తులు
దేశభక్తి కోసం దేశాన్ని విడిచిన
దయగల హృదయులు
మనిషి పుట్టడంతో సంతోషపెడతాడు
మరణంతో బాధపడతాడు
వీరు మరణంతో దేశాన్ని మమైక్యపరిచి చరిత్రలో నిలిచిన
స్ఫూర్తిదారులు

- దాసరి వెంకటరమ్య
ఎస్.కె.ఎస్.డి మహిళా కళాశాల(తణుకు)

## సమైక్య భారతం



ప్రతీ సంవత్సరంలాగే
ఈ సారి వచ్చింది
భరతమాతకు
ప్రతీచోట ఎగిరే
మువ్వన్నెల జెండా
కానీ రెపరెపలాడే
జెండా ఎర్రకోట మీద
ఎగిరేది అసలైన
స్వాతంత్ర జెండా
ఇన్ని సంవత్సరాల తర్వాత రాష్ట్రపతి భవన్లో ఆ స్త్రీమూర్తి ఎగురవేసే పతాకం
భారతదేశం అవలంభిస్తున్న అన్ని జాతుల వారికి సమాన అవకాశం ఇస్తున్న సంకేతం
ఎందరో త్యాగధనులు భారత భూభాగంపై తమ జీవితాలను ధారపోసిన నేల ఇది. ఒకసారి ఆలోచించండి గాంధీజి అన్నట్లు నేటికీ కూడా అర్థరాత్రి దాటాక కూడా స్త్రీకి స్వేచ్ఛ లేని రోజు ఏది.
నూటయాభై ఏళ్లు విదేశీయులు పాలించిన రాజ్యమిది
బాల్యంలోనే విదేశీయులను పారద్రోలాలి సాహసించి ప్రతిఘటించిన అల్లూరి సీతారామరాజు నడిచిన నేలఇది.
ఆంగ్లేయులును పాలన అంత మొందించడానికి
పిన్నవయస్సులోనే ఉరికంబం నెక్కిన భగత్ సింగ్ జన్మించిన స్థానమిది. సైన్యాన్ని సమీకరించి ఆంగ్లేయులును ఎదిరించి ‘గగనతలంలో కలిసిపోయిన అమరజీవి పుణ్య స్థలం ఇది.
అమరవీరుల త్యాగఫలాన్ని అనుభవిస్తూ వారి ఆత్మకు శాంతి అర్పించే నివాళి దినం.
దేశ విముక్తి పోరాటానికి స్వతంత్ర భారతపురోగతికి దర్పణం.
తన రచనలతో యువతలో దేశభక్తిని చాటిన ఒక చిలకమర్తి తెలుగు వారి మదిలో జాతీయ చైతన్యం కల్గించిన ఆనాటి గరిమెళ్ళ.

భీమరాజు రామభద్రిరాజు
చెల్లూరు.

## భారతీయుని బాధ్యత



భారతీయతని బలంగా మార్చుకుంది నేటి తరం..
మరింత మురవాలి ముందుతరం..
శ్రమిద్దాం నిరంతరం.. వందేమాతరం!
అన్ని దేశాల్లో కెల్లా.. భారతదేశం మిన్న అని
చాటి చెప్పే దిశగా అడుగులేస్తూ..
జరుపుకుందాం ఈ స్వాతంత్ర్యపు పండుగను
మెండుగా కన్నుల పండుగగా..!!
నేటి మన స్వాతంత్ర్య సంభరం..
ఎందరో త్యాగవీరుల త్యాగఫలం.
దేశభక్తితో మీ హృదయాన్ని నింపుకోవాల్సిన
సమయం ఇది.
మనం ఈ రోజు వేడుక జరుపుకోవడానికి
వారి ప్రాణాలను త్యాగం చేసిన వారికి
తల వంచి నమస్కరిస్తున్నాను.
ఆంగ్లేయుల చెర నుంచి భారత్‌ను విడిపించిన
వారి కృషి అసాధారణమైనది.
వారి త్యాగాలని స్వాతంత్ర్య వేడుక సందర్భంగా స్మరించుకుందాం.
స్వాతంత్ర్యం, స్వేచ్ఛ అంటే ఎంజాయ్ చేయడం కాదు.
దాన్ని అర్థం చేసుకోవాలి. గౌరవించాలి.
ప్రజాస్వామ్యాన్ని సురక్షితంగా ఉంచడమే దేశమాతకు మనమిచ్చే ఘనమైన నివాళి.
– స్వాతంత్ర్య సమరయోధులు కలగన్న భారత్‌ను నిర్మించుకుందాం.
మన దేశాన్ని అత్యుత్తమంగా మారుద్దాం.
శాంతికి, దయకు మారుపేరుగా నిలుపుదాం.
వందేమాతరం..
భారతీయతే మా నినాదం..
మన స్వేచ్ఛ, స్వాతంత్ర్య కోసం అశువులు బాసిన సమరయోధుల దీక్ష, దక్షతలను స్మరిస్తూ..
ఎందరో మహానుభావులు, సమరయోధుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన ‘స్వాతంత్ర్యం’ ఇది.
తెల్లదొరల తలలు వంచి.. సాధించిన ‘స్వాతంత్ర్యం’ ఇది. మువ్వన్నెల రెపరెపల్లో..
కులమతాలకు అతీతంగా పండుగలా సాగే పంద్రాగస్టు రోజు ఇది. ప్రతి భారతీయుడి గుండె దేశభక్తితో ఉప్పొంగే రోజు ఇది.

-కె.నాగమణి,బి.ఎడ్.

## నేతాజీ ఆలోచనలు



“చర్చల ద్వారా నిజమైన మార్పు
చరిత్రలో ఎప్పుడూ సాధించబడలేదు,
నాకు రక్తం ఇవ్వండి మీకు స్వాతంత్ర్యం
ఇస్తాను.
“ఈరోజు మనకు ఒక్క కోరిక మాత్రమే
ఉండాలి. భారతదేశం జీవించేలా
చనిపోవాలనే కోరిక!
కానీ నువ్వు బ్రతికే ఉన్నావో నీకు తెలీదు కాబట్టి నువ్వు ఇంకా బతికే ఉన్నావు”
నేతాజీ సుభాస్ నువ్వు చనిపోలేదు, బ్రతికే ఉన్నావు ఎప్పటికీ జీవించే ఉంటావు

- పరిడల ప్రవల్లిక
బి.ఫార్మసీ.

## విప్లవ వీరులు



బ్రిటిష్ దొరల చేతిలో చిక్కిభారతీయుల అనుభవిస్తున్న
బానిసత్వం సంకెళ్లను
త్రెంచు కోవడానికి కావలసిన
తెగువ జనించి
స్వేచ్ఛ కోసం ప్రాణాలను
సైతం పణం గా పెట్టడానికి
ఉగ్ర నరసింహు లై
ముందడుగు వేశారు
మారణ హోమం
సృష్టించిన వారి
కోట పైన జెండా పీకి
మన మువ్వన్నెల జెండా
ఎగుర వెయ్యడానికి
రొమ్ము చాచి బడ బాగ్ని వలె
దూసుకు వెళ్లారు
వారి వీరత్వం
దుష్టసమూహానికి స్వేదం
పుట్టించిన వైనం
భరత మాత రుణం తీర్చుకున్న
సాహసం మరువలే నిది
ఉద్వేగ భరితమైన స్ఫూర్తితో
మన విప్లవ వీరులు
బ్రిటిష్ సామ్రాజ్య పునాదులు
పెకలించి శాంతి స్థా పన చేశారు
నర నరాల్లో పౌరుషం తో
ఉరకలెత్తే రుధిరం తో
విప్లవ శంఖం పూరించి
యావత్ దేశాన్ని
చైతన్యపరిచారుజి
భారత దేశ కీర్తి
పతాకాన్ని గర్వం గా
రెప రెప లాడించా రు
స్వతంత్ర్య కాంక్ష సిద్ధించి
భారత విప్లవ వీరులు
నూతన సమ సమాజ
స్థాపన చేసి
చరిత్ర పుటల్లో
సువర్ణా అక్షరాలు గా
నిలిచారు.

- ఎం.ఎన్.వి.సూర్యకుమారి
తెలుగు అధ్యాపకురాలు
ప్రకాశం డిగ్రీ కళాశాల
కొయ్యలగూడెం.


## ఎమ్.కె.గాంధీ ఆలోచనలు



“మీ ఆలోచనలను సానుకూలంగా
ఉంచండి... ఎందుకంటే మీ
ఆలోచనలు మీ మాటలు
చెందినవిగా మారతాయి.
మీ మాటలును సానుకూలంగా
ఉంచటం ఎందుకంటే మీ మాట
మీ ప్రవర్తనమరి.
మీ ప్రవర్తనను సానుకూలంగా
ఉంచుకోండి ఎందుకంటే మీ
ప్రవర్తన మీ అలవాటుగా
మారుతుంది.
మీ అలవాట్లను సానుకూలంగా
ఉంచండి ఎందుకంటే మీ
అలవాట్లు మీ విలువలుగా
మారతాయి.
మీ విలువలను సానుకూలంగా
ఉంచండి. ఎందుకంటే మీ
విలువలు
మీ విధిగా మారుతాయి.
సేవలో మిమ్మల్ని మీరు కోల్పోవడమే మిమ్మల్ని మీరు కనుగొనడానికి
ఉత్తమమైన మార్గం

- పరిడల ప్రవల్లిక
బి.ఫార్మసీ (4వ సం)
యూనివర్సిటీ టి.పి. గూడెం కాంపస్

## విప్లవాగ్ని




వేరు మందు నూరి పోసి
వేద భూమి జీల్చుచూ
పారతంత్య మందునుంచ
పార దేశివచ్చెగా
ధీర జాతి తిరగ బడగ
దిక్కులొక్కటవునులేజి
వీర భగతుసింగమయ్యె
వీరి పీడనణచగా
భరతజాతిరత్నమొకటిజి
బాణమొౘమండెగా
గిరిజనులకు నండగా
రగిలెను తెల్లవారి పై
మరణమునకెదురునిలచెను
మరతుపాకి చీల్చగా
ఒరిగిన నడుగులనుపట్టి
యుద్యమంబు సాగెగా

బి హెచ్.ధన్వంతరి
అమలాపురం
.ఎ.ఎస్.ఎన్ కళాశాల
తెలుగు అధ్యాపకులు

# స్వాతంత్ర్య భారతావనికి 77 ఏళ్లు

భారత దేశం భరతుడు పరిపాలించిన దేశం. పాడి పంటలు ఖనిజ సంపద భూ,జలవనరులు సమృద్ధిగా కలిగిన దేశం.
భిన్నత్వంలో ఏకత్వం మిశ్రమ సంస్కృతి గల ఏకైక సామ్యవాద లౌకిక దేశంమనభారత దేశం.
ఇలాంటి పుణ్య భూమిలోకి మొదట్లో ఆంగ్లేయులు పొట్టకూటి కోసంవ్యాపారం నిమిత్తం మన దేశానికి వలస వచ్చి భారతీయ సంపదను దోచుకొని భారతీయులను భానిసలుగా మార్చి వారిపై ఆధిపత్యంను చెలాయించే వారు.

**భారత స్వాతంత్ర్యోదయం**

బ్రిటిష్ వారి నిరంకుశ పాలన నుండి భరతమాత దాస్యశృంఖలాలను తెంచడానికి ఎందరో స్వాతంత్ర సమర యోధులు,విప్లవ కారులు, ఛత్రపతి శివాజీ ఝాన్సి లక్ష్మి భాయ్ సర్దార్ వల్లభాయ్ పటేల్ గాంధీజీ సరోజినీ నాయుడు భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు జవహర్ లాల్ నెహ్రూ టంగుటూరి ప్రకాశం పంతులు సుభాష్ చంద్ర బోస్ వంటి మహనీయులు అనేక రకాల ఉద్యమాలు నిరసనలు తిరుగుబాట్లు స్వాతంత్ర్యం కోసం యుద్ధం చేసి తమ ప్రాణాలను సైతం పణం గా పెట్టి మనకి చివరికి 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి(తెల్లవారితే 15వతేది.) స్వాతంత్ర్యాన్ని అందించారు.
స్వాతత్ర్యోద్యమం తర్వాత ఆ నాటి మన దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పాలన లొ డా.బాబు రాజేంద్ర ప్రసాద్ గారి అధ్వర్యంలో రాజ్యాంగ ప్రణాళిక సంఘం ఏర్పడింది దీనికి నాయకులు డా. భీమ్ .రావు అంబేత్కర్ గారు దాదాపు మూడు సంవత్సరాలు అనేక దేశాలు పర్యటించి మన రాజ్యాంగాన్ని రచించారు రాచరిక పాలనని రద్దు చేసి ప్రజాస్వామ్య పరిపాలన కి నాంది పలికారు...

**నేటి భారతం - దేశభక్తి**

ఎందరో త్యాగధనుల కృషి వల్ల మనకి ఈ నాడు అనుభవిస్తున్న స్వతంత్రం లభించింది... అలాంటి స్వేచ్ఛని నేడు మనం ఎంతవరకు గౌరవిస్తున్నాం ఎలా వినియోగిస్తున్నాము అన్నది సాటి భారతీయులుగా ఎవరికి వారు ఆలోచించవలసిన అంశం...

స్వాతంత్రం మరియు దళితుల అభ్యున్నతి కోసం మహా కవి శ్రీశ్రీ మరొప్రపంచం పిలిచింది పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి కదం త్రొక్కుతూ పదం పాడుతూ అభివృద్ధి వైపు అడుగులు సాగాలి ఆని సూచించారు.
గాంధీ మహాత్ములు ఒక స్త్రీ ఎప్పుడైతే నిర్భయంగా అర్ధరాత్రి రోడ్డుపై తిరగ్గలిగినప్పుడు దేశానికీ నిజమైన స్వాతంత్ర్యం ఆని సందేశం తెలిపారు కానీ నేటి భారత దేశం లో స్త్రీలను గౌరవించడం కేవలం మాట మాత్రమే ఆ పరిస్థితే వుంటే మొన్న ఢిల్లీ లో నిర్భయ, అత్యాచారం మణిపూర్ లో 2తెగల మధ్య ఘర్షణవల్ల పట్టపగలు నడిరోడ్డుపై ఇద్దరు స్త్రీలను నడివీదిలో వివస్త్రలను చేసిఊరేగించరు.. వయసు తో సంబంధం లేకుండా ఆడవారిపై అఘాయిత్యాలు జరగవు.
ఓ నాడు పాడిపంటలతో సస్యశ్యామలంగా వున్న దేశం నేడు పారిశ్రామికీకరణ పట్టణీకరణ అభివృద్ధి పేరుతో భంజరభూములు బీడుభూములుగా మారిపోతున్నాయి..



దేశం కోసం కు
సరిహద్దుల్లో దేశం కోసం
జవాన్ తన కుటుంబాన్ని సైతం వదిలి కావలి కాసి శత్రుదేశాల నుండి రక్షణని అందిస్తాడు.కానీ మనం కుటుంబం లో అస్తివిషయంలో సొంత వారినే శత్రువుగా చూస్తాం.ఆ నాడు రైతే అన్నదాత కానీ నేడు ఆ రైతులకే ఆహారం కరువైంది.
మన శాస్త్రవేత్తలు అంతరిక్షం లోకి సైతం ఉపగ్రహాలను విజయవంతంగా ప్రవేశపెడుతున్నారు గానీ సాటి మనిషి లో దేశ భక్తి నీ నైతిక స్వభావాన్ని పెంపొందించ లేకపోతున్నారు.
ఇతర దేశాలు మన దేశ చరిత్రను సంస్కృతి నీ కీర్తిస్తూ గౌరవిస్తూ వుంటే మన భారతీయులం అంతా ఆధునీకత పేరుతో పార్చాత్య దేశాల ఒరవడిని అలవరుచుకోని
మన సంప్రదాయాన్ని ఔన్నత్యాన్ని గుర్తుంచుకోవడంలేదు.
ఆనాడు స్వతంత్రం దేశభక్తి కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టేవారు , ఇప్పుడు దేశభక్తి అంటే పుస్తకాల్లో పాఠం వరకు పరిమితమైపోయింది ఆగస్టు 15 జనవరి 26 న ఫోన్లు లేక సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అయ్యే కదనాల వరకు పరింతమైంది.
ఆనాడు ప్రపంచ దేశాలకి అహింస శాంతి కి నిలయం గా వున్న మన భారత దేశం శత్రుదేశాల దాడులు దేశం లో చాలా రేగుతున్న కుల మత రాజకీయ పరిణామాల వల్ల దేశ శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లతుంది...నిత్యం అహింస చెలరేగడం వల్ల బాంబు దాడులులతో తుపాకీ పేలుళ్లతో మరణ హొమం గా మారుతుంది.
నిజమైన దేశాభివృద్ధి ఎప్పుడంటే :
ప్రజల్లో దేశభక్తి సోదరభావం పెంపొందినప్పుడు.
అజలితీర్చే రైతులు రక్షణనిచ్చే జవాన్లుకు సరైన గుర్తింపు గౌరవం లభించినప్పుడు.

స్త్రీలు గౌరవించబడినప్పుడు...
ప్రజలకు అవినీతి రహిత పాలన అందినపుడు....
లిపిల్లలకు చిన్నతనం నుండి మన దేశ చరిత్ర, స్వేచ్ఛ సంస్కృతి పై అవగాహన కల్పించినప్పుడు...
మన త్రివర్ణ పతాకం రాజ్యాంగం పట్ల గౌరవం నిబద్దత భారతీయులందరికీ కలిగినప్పుడు ...
కులమత భేదంలేకుండా ఏక లౌకిక రాజ్యం గా మారినప్పుడు... ఇదంతా సాధ్యం కావాలంటే ప్రతీ భారతీయ పౌరుడిగా నాదేశం నా మాతృభూమి అన్న భావంతో నిస్వార్ధం గా జీవించగలగలి...నా దేశం అభివృద్ధి ఆన్న ఉద్దేశం తో మెలిగితే ...మన దేశానికి మహొన్నత స్థానం లభిస్తుంది ...
ఈ నాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల ప్రాణ త్యాగ నిరతి కి ప్రతిఫలం ... అటువంటి పుణ్య మూర్తులను మనం అంతా ఆదర్శం గా తీసుకోవాలని భారతీయులందరికీ 77వ స్వేచ్ఛా దినోత్సవ శుభాకాంక్షలు...

**జైహింద్ జైభారత్!**

**- టి. తరుణ్ సాయితేజ ఎం.ఎస్సీ బోటని,నన్నయ యూనివర్సిటీ**

# స్వాతంత్రోద్యమ స్ఫూర్తి... దేశభక్తి



తెల్ల దొరల బానిసత్వపు సంకెళ్లు తెంచడానికి, భారత మాతకు స్వేచ్ఛ వాయువులు అందించడానికి,బ్రిటిష్ పాలకుల బానిసత్వం నుండి బయటపడడానికి ఎందరో స్వాతంత్ర సమరయోధులు చేసిన ప్రాణత్యాగాలు, పోరాటాల ఫలితంగా 1947 ఆగస్టు 15 న స్వాతంత్రం సంపాదించుకున్నాం. అయితే ఈ స్వాతంత్రం కొంతమంది వల్లే మాత్రమే రాలేదు.గాంధీ,సుభాష్ చంద్ర బోస్, నెహ్రూ,భగత్ సింగ్,చంద్రశేఖర్ ఆజాద్, వల్లభాయ్ పటేల్ వంటి నాయకులు ప్రజల్లో రగిలించిన స్వాతంత్రోద్యమ స్ఫూర్తి వలన, వారిలో సహజంగా ఉన్న దేశభక్తి వలన నిరంతరం నిరసన ప్రదర్శనలు,సత్యాగ్రహాలు, తిరుగుబాట్లు, విప్లవాలతో ఉద్యమాలు చేపట్టి బ్రిటిష్ వారికి చెమటలు పట్టించారు.
16వ శతాబ్దంలో పోర్చుగీసు వారి దురాక్రమణాలకు వ్యతిరేకంగా అబ్బక్కరాణి చేసిన పోరాటాల దగ్గర నుండి..ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు వరకు స్వాతంత్రోద్యమం మొదటి అడుగుగా చెప్పవచ్చు. తర్వాత 1885 నుంచి 1905 వరకు మితవాదులుగా, 1905 నుంచి 1920 వరకు అతివాదులుగా,1920 నుంచి 1947 వరకు గాంధీ యుగముగా చెప్పుకొని బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేయడం ప్రారంభించారు. స్వాతంత్రం సంపాదించడం కోసం బ్రిటిష్ తుపాకులను ముద్దాడిన భారత వీరుల హృదయాలెన్నో.అలాగే తమకున్న ఆస్తిపాస్తులు అన్నింటినీ త్యాగం చేసి ప్రజల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని,దేశభక్తిని రగిలించి చిన్నపిల్లడి దగ్గర నుంచి పండుముసలి వరకు బ్రిటిష్ వారిపై తిరగబడిన ప్రాణాలు ఎన్నో మనం చెప్పక్కర్లేదు.
వీరపాండ్య కట్ట బ్రహ్మన్న, అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా వంటి యోధుల పోరాటాలు ఒకవైపు..సంతాల్ ఆదివాసీల పోరాటాలు, గదర్ ఉద్యమాలు, హొమ్ రూల్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, ఆజాద్ హింద్ ఫౌజ్,క్విట్ ఇండియా ఉద్యమాలు ఒకవైపు..
యువతలో,ప్రజల్లో స్ఫూర్తినిచ్చే ప్రసంగాలు చేస్తూ పోరాటం చేస్తున్న స్వాతంత్ర సమరయోధులు ఒకవైపు వీటన్నింటి ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛ స్వాతంత్ర్యం.
ఈ స్వేచ్ఛ వాయువులు మనకందకపోయినా పర్వాలేదు కానీ మన భవిష్యత్ తరాలకు బ్రిటీష్ వారి బానిస సంకెళ్లు ఉండకూడదనే ఉద్దేశంతో ఎందరో అమరవీరులు, స్వాతంత్ర సమరయోధులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి, జైల్లో మగ్గి,బ్రిటిష్ వారి చేత ఎన్నెన్నో దెబ్బలు తిని మనకు వెలకట్టలేని విజయాన్ని అందించారు. ఈ అసాధారణ విజయం వెనుక ప్రతి ఒక్క భారతీయుడు ముఖ్యంగా మహిళలు కూడా తమ వంతు పాత్రను పోషించారనడంలో ఎటువంటి సందేహము లేదు.కుల,వర్గ,జాతి, మతాలకు వ్యతిరేకంగా అందరూ ఒక్కటై దేశభక్తిని చాటుతూ తమలో తాము స్ఫూర్తిని రగిలించుకుంటూ స్వాతంత్రం సంపాదించుకున్నారు.
నేటి మన స్వాతంత్ర్య సంబరం ....ఎందరో త్యాగ వీరుల త్యాగఫలం

**-బి.సుశాంత్ కుమార్**

## ఎగురుతోంది పతాక!!



ఎగురుతోంది-ఎగురుతోంది -మన జాతి పతాకమ్మురా!
మన జాతికి చిహ్నం గా నిలుస్తున్న -నీతి ప్రతీకమ్మురా!
**॥ ఎగురుతోంది ॥**
సమభావన -సహజీవన లక్ష్యంగా-ఎగురుతున్న జాతి పతాకమ్మురా!
అశోకుడు ఏలిన ధర్మప్రదేశం -బుద్ధుని జన్మప్రదేశం మనీ చాటుతున్న- జాతి పతాకమ్మురా!
వీరశూర యోధుల దేశం-కళలు,కవులు పుట్టిన పుణ్యప్రదేశమనీ ఎగిసిన జాతిపతాకమ్మురా!
సమతా-మమతా రాగాల-సస్యశ్యామలభరితంగా ఎగురుతున్న -జాతి!పతాకమ్మురా!
**॥ ఎగురుతోంది ॥**
త్యాగం-ధర్మం -జాతి ప్రాణమనీ కాషాయరంగే ననీ చెప్పిన జాతి పతాకమ్మురా!
అహింసా-సత్యం -దేశఊపిరి యని -తెల్లని రంగేయని తెలిపిన జాతిపతాకమ్మురా!
సాహస-సాయుధ గుణములను పచ్చని రంగే యని చాటిన జాతి పతాకమ్మురా!
సక్రమ రీతిన-చక్రం ధర్మ నిరతినీ వివరించిన జాతి పతాకమ్మురా!
**॥ ఎగురుతోంది॥**

**- రావుపల్లి రాజశేఖర్, కాకినాడ**

# స్వాతంత్రోద్యమ స్ఫూర్తి



స్వాతంత్ర
సమరయోధులారా..!
మీకు శతకోటి వందనాలు..
త్రివర్ణ పతాక రూపశిల్పి..
నీకు పాదాభివందనాలు
మాకోసం సమస్తం త్యాగం చేశారు
శత్రువులపై సమరభేరీ మోగించారు
స్వేచ్ఛ వాయువులు అందించారు
వీరుల్లారా మీకు వందనాలు
ఎన్నెన్నో అవమానాలు ఎదురైనా..మరెన్నో లాఠీదెబ్బలు తగిలిన ఓర్పుతో నిలిచారు...
సాధించారు
ప్రతి ఒక్కరిలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించారు
ఎర్రకోటపై మువ్వన్నెల జెండా ఎగురవేశారు
ప్రతిఒక్కరి మనస్సును ఆనందంతో నింపారు భారతజాతి ఖ్యాతిని ఎల్లలు దాటించినా వీరులందరికీ మా నీరాజనాలు!!

**- బి.సుశాంత్ కుమార్**